క్లుప్తంగా

మహిళల ఆరోగ్యం కుటుంబానికి రక్ష

జె.పంగులూరు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బలంగా ఉంటుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యుడు డాక్టర్ శివచెన్నయ్య అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందించే వైద్య సేవలు గురించి మంగళవారం డాక్టర్ శివచెన్న తెలియజేశారు. సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం వలన వ్యాధులను ముందుగానే పసిగట్టవచ్చన్నారు. రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము కాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటివి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

వేటపాలెం: స్థానిక రోటరీ క్లబ్ కమ్యూనిటీ హాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ చార్టెడ్ ప్రెసిడెంట్ గొల్లపూడి సీతారం ఉచిత తకంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఒంగోలుకు చెందిన స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్ వైద్యులు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. డీఓఏ మాధవన్, టెక్నిషియన్ మనోజ్, పీఆర్ఓ గోపీచంద్, కొత్త శ్రీనివాసరావు, కారంచేటి శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్దినేని హనుమంతురావుకు నివాళి



హనుమంతురావు చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న శ్రీలక్ష్మి

ఇంకొల్లు (చినగంజాం): వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మద్దినేని హనుమంతురావు ఇటీవల మరణించటంతో ఆయనకు ఇంకొల్లు జెడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి నివాళులర్పించారు. మంగళవారం ఇంకొల్లులోని ఆయన స్వగృహానికి వెళ్లి హనుమంతురావు చిత్రపటానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. హనుమంతురావు లేని లోటు పార్టీకి తీర్చలేనిదని సమర్థులైన నాయకుడిని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. మాజీ జెడ్పీటీసీ భవనం శ్రీనివాసరెడ్డి, ఆయేషాబుడే, భవనం హరేరామరెడ్డి, సుభాని, తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ లోపల దారులను ఆక్రమించిన రిటైల్ వ్యాపారులు



దారులను ఆక్రమించి ఇలా..

కొనుగోలుదారులకు ఇక్కట్లు

- చీరాల నెహ్రూ కూరగాయల మార్కెట్ నిర్వహణ అస్తవ్యస్తం
- మార్కెట్‌లోకి వెళ్లడానికి వీలులేకుండా ఆక్రమించుకుంటున్న వ్యాపారులు
- హోల్‌సేల్ వ్యాపారులు.. తమ పొట్ట కొడుతున్నారంటూ చిరు వ్యాపారుల ఆవేదన
- కొరవడిన మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ



చీరాల రూరల్: చీరాలకు ప్రాముఖ్యత తెచ్చే నెహ్రూ కూరగాయల మార్కెట్ నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో దుకాణదారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కొనుగోలుదారులు నడిచే దారులను సైతం ఆక్రమించుకుంటున్నారు. అలానే హోల్‌సేల్ వ్యాపారులు, రిటైల్ వ్యాపారుల మాదిరిగా దారులను ఆక్రమించుకుని వ్యాపారం చేసుకుంటూ తమ పొట్టకొడుతున్నారని రిటైల్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ఇంత తంతు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మార్కెట్లోని చిరువ్యాపారులతో పాటు కొనుగోలుదారులు అధికారుల తీరుపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు.

పదేళ్లక్రితం ఏర్పాటు

చీరాల చుట్టు పక్కన పండించిన కూరగాయలు, ఆకు కూరలను తెల్లవారుజామునే రైతులు ఆటోల్లో చీరాలకు తీసుకొచ్చి స్వయంగా విక్రయాలు చేసుకుంటూ ఉపాధి పొందుతుంటారు. గతంలో ఉన్న పాత మార్కెట్ స్థానంలో పదేళ్లక్రితం నూతనంగా మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో సుమారు 174 వరకు దుకాణాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాలు ఎవరికైతే కేటాయించారో వారే వ్యాపారాలు చేసుకోవాలి. కానీ పేరొకరిది.. వ్యాపారాలు చేసేది వేరొకరుగా అక్కడ పరిస్థితి దాపురించింది. అలానే 13 వరకు హోల్‌సేల్ కూరగాయల దుకాణాలున్నాయి. వీరుకూడా వారికి కేటాయించిన దుకాణాల్లోనే వ్యాపారాలు చేసుకోవాలి. కానీ కొనుగోలుదారుల కోసం ఏర్పాటు చేసిన దారులపై వ్యాపారులు ఇష్టానుసారంగా తట్టలు, బుట్టలు అడ్డుగాపెట్టి నడిచేందుకు వీలులేకుండా చేస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులంతా తెల్లవారు జాము నుంచి ఉదయం 11 గంటల వరకు వ్యాపారాలు చేస్తూ రిటైల్ వ్యాపారాలు లేకుండా చేస్తున్నారు. వాస్తవానికి హోల్‌సేల్ వ్యాపారులు రిటైల్ వ్యాపారం చేయకూడదు. కానీ అరకిలో కూరగాయలు కూడా అమ్ముతూ కొనుగోలు దారులను మార్కెట్‌లోపలికి కూడా రానివ్వడంలేదని.. ఫలితంగా నష్టాలబారిన పడుతున్నామని.. రిటైల్ వ్యాపారులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మార్కెట్ నిర్వహణ సక్రమంగా లేదని హోల్‌సేల్ వ్యాపారుల వలన రిటైల్ వ్యాపారాలు పూర్తిగా దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని నెలరోజుల క్రితం మార్కెట్ ప్రెసిడెంట్, సెక్రటరీలు మున్సిపల్ కమిషనర్‌తో పాటు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఇంత వరకు ఎటువంటి స్పందనా లేదని చెబుతున్నారు.

ప్రైవేట్ అపార్టుమెంట్‌పై మక్కువ ఎందుకో..

ప్రైవేట్ అపార్టుమెంట్‌పై ఉన్న ప్రేమ మార్కెట్‌పై ఎందుకు చూపడంలేదు. రెండు నెలల క్రితం మున్సిపల్ కమిషనర్ ఓ ప్రైవేటు అపార్టుమెంట్ విషయంలో అత్యుత్సాహం చూపించారు. మున్సిపల్ కౌన్సిలర్ ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్ స్వయంగా పాలిమేర రోడ్డులోని ఓ ప్రైవేటు అపార్టుమెంట్ వద్దకు చేరుకుని అపార్టుమెంట్‌పై అంతస్తుల్లో నివాసముంటున్న వారికి బట్టలు, బట్టల బేళ్లు అడ్డుగా ఉన్నాయంటూ వాటిని తొలగించాలంటూ హుకుం జారీ చేశారు. వాటిని తొలగించకుంటే మున్సిపల్ సిబ్బందితో అన్నింటిని బయటకు లాగేయిస్తానని ఆయా దుకాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రైవేటు అపార్టుమెంట్‌పై ఉన్నప్రేమ రెండు లక్షల మంది పట్టణ జనాభాకు ఉపయోగపడే కూరగాయల మార్కెట్‌పై ఎందుకు ప్రేమ చూపడంలేదని ప్రజలు కమిషనర్ తీరును తీవ్రంగా దుయ్యబడుతున్నారు.

పార్కింగ్ ప్రాంతం కూడా..

మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చే కొనుగోలుదారుల వాహనాల పార్కింగ్ కోసం మార్కెట్ ఏర్పాటు చేసిన సమయంలోనే ప్రత్యేకంగా గ్రిల్స్ ఏర్పాటు చేసి అందులో వాహనాలు నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. కానీ వ్యాపారులు పార్కింగ్ స్థలంలో పెద్ద కూరగాయల మూటలువేసి ఆక్రమించుకుని అక్కడ కూడా వ్యాపారం చేస్తున్నారు. మరికొందరైతే అకడుగు ముందుకువేసి అధికారులను మచ్చికచేసుకుని కొన్ని దుకాణాలను కూడా నడుపుతున్నారు.

> **వ్యాపారులను కట్టడి చేయాలి**
>
> హోల్‌సేల్ వ్యాపారుల వలన రిటైల్ వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. హోల్‌సేల్ వ్యాపారులే రిటైల్ వ్యాపారం కూడా చేస్తున్నారు. అరకిలో, పావుకిలో మేర విక్రయించడం వలన కొనుగోలుదారులు మార్కెట్లోపలికి రావడంలేదు. రిటైల్ వ్యాపారాలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. వారికి కేటాయించిన దుకాణాలలోనే వ్యాపారాలు చేయాలి.
>
> – పార్వతి, మార్కెట్ సెక్రటరీ

అద్దంకిలో వర్షం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

అద్దంకి: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మంగళవారం ఉరుములతో కూడిన వర్షం పడింది. ఈ వర్షంతో ప్రస్తుతం ఖరీఫ్‌లో సాగు చేసిన కంది, మొక్కజొన్న, పశుగ్రాసం పంటలతోపాటు వివిధ రకాల కూరజాతి పంటలకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. దీంతో పాటు ఇటీవల రర్షాలకు వర్షాలు లేక ఎండలు మండుతున్నతరుణంలో ఈ వర్షం ప్రజలకు వేడి, ఉక్కపోత నుంచి ఉపశమనం కలిగించింది.

ఉత్సాహంగా ఆటల పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎంఈఓ నాయక్

మార్టూరు: బబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంఈఓ ఎంసీ హెచ్ నాయక్ మండల స్థాయి ఆటల పోటీలను ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ.. ప్రైవేటు పాఠశాలలకు చెందిన 10వ తరగతి లోపు విద్యార్థులు ఆటల్లో పాల్గొని రాణించడం ద్వారా డివిజన్ స్థాయి జిల్లా స్థాయి ఆటల పోటీల్లో పాల్గొనాలన్నారు. ఆటల పోటీలు స్నేహపూర్వక వాతావరణంలో జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల వ్యాయామ మార్టూరు: ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యా శిక్షణ సామాజిక బాధ్యత



వలంటీర్లకు మెటీరియల్ అందజేస్తున్న ఏపీఎం పెద్ద సుబ్బారావు

చినగంజాం: వయోజనులకు విద్యనందించడాన్ని సామాజిక బాధ్యతగా భావించి కృషి చేయాలని వెలుగు ఏపీఎం పెద్ద సుబ్బారావు అన్నారు. మంగళవారం వయోజన విద్య శిక్షకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల సచివాలయాల పరిధిలో 15 సంవత్సరాలు దాటిన వయోజనులను గుర్తించి వారి దైనందిన జీవితానికి ఉపయోగపడేలా చదువు చెప్పేందుకు వలంటీర్లను ఎంపిక చేశామన్నారు. వారితో పాటు సీసీలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారికి మెటీరియల్ అందజేశారు. వయోజన విద్యా పర్యవేక్షకులు కొణిదెల మనోరంజన్‌బాబు, మండల సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

పంగులూరు పీహెచ్‌సీలో విశ్వకర్మ జయంతి

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం విశ్వకర్మ జయంతి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వైద్యశాలలోని రోగులకు పండ్లు పంచిపెట్టారు. డాక్టర్ శివచెన్నయ్య, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బత్తుల వీరనారాయణ, మిడిదొడ్డి సుబ్బారావు, విశ్వబ్రాహ్మణులు సంఘ నాయకులు ఓంకార్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసపాటి సాంబశివరావు, రవి చంద్ర పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంచి పెడుతున్న నాయకులు

బూచేపల్లిని కలిసిన బ్రహ్మానంద రెడ్డి



బూచేపల్లిని మర్యాద పూర్వకంగా కలిసిన బ్రహ్మానంద రెడ్డి

చినగంజాం: దర్శి శాసన సభ్యుడు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డిని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి మంగళవారం ఆయన నివాస గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పర్చూరు నియోజకవర్గ పరిధిలో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల గురించి ఆయన ఎమ్మెల్యేతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక నాయకులు కుక్కల వెంకటేశ్వరరెడ్డి, ఎం. హేమంత్ కుమార్ రెడ్డి, రఘురామిరెడ్డి పాల్గొన్నారు

14874 స్మార్ట్ రైస్ కార్డులు సిద్ధం

జె.పంగులూరు: మండల పరిధిలోని 21 గ్రామాలకు గాను ఇప్పటికి క్యూఆర్ కోడ్ బేస్‌డు స్మార్ట్ రైస్ కార్డులు మండలానికి వచ్చాయని మంగళవారం తహసీల్దార్ పి. సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. రైస్ కార్డులను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదగా లబ్ధిదారులకు అందించనున్నట్లు తెలిపారు.

బల్లికురవ విద్యార్థుల సత్తా

అద్దంకి రూరల్: విద్యతోపాటు వ్యాసరచన వకృత్వ పోటీల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావటం అభినందనీయమని ఎంఈవో 1 కె. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంఆర్‌సీలో మండల స్థాయిలో వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో కెజీబీవీకి చెందిన జె.జమమత, బి. అమృత, కె.తేజస్విని.. వకృత్వంలో కూకట్లపల్లి పాఠశాలకు చెందిన సీహెచ్ దాక్షయిణి, ఇప్పల సుభాషిణి, గోరంట్ల సాయిచరణ్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. ఎంఈవో 2 కె. రమేష్‌బాబు, హెచ్ఎంలు హనుమంతరావు, జాన్ పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే హిందీ ప్రవేశపెట్టాలి



సీహెచ్ హనుమంతురావు

పర్చూరు(చినగంజాం): ప్రాథమిక స్థాయి నుంచి హిందీ భాషను ప్రవేశపెట్టి పండితులను నియమించాలని హిందీ టీచర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ హనుమంతురావు కోరారు. ప్రాథమిక స్థాయి నుంచే హిందీ బాష పరిజ్ఞానం విద్యార్థులకు అవసరమన్నారు. రాష్ట్రంలో ఉన్న హిందీ పండితులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. డీఎస్సీ నియమాలకు ముందే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

పర్యావరణ పరిరక్షణలో ఓజోన్ కీలకం



చినగంజాంలో ఓజోన్ ఇంగ్లీష్ ఆకృతిని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చినగంజాం: జీవరాసులను కాపాడటంలో ఓజోన్ పొర కీలక పాత్ర వహిస్తుందని చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె. శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా ఓజోన్ పొర ప్రాముఖ్యత గురించి పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓజోన్ అనే ఇంగ్లీష్ పదాన్ని విద్యార్థులను ఆదే అకతిలో కుర్చోపెట్టి ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఓజోన్‌పొర దాని ప్రాముఖ్యత , దెబ్బతినటం వల్ల కలిగే అనర్థాలు, తదితర అంశాల గురించి వివరించారు.

ఇంకొల్లు(చినగంజాం): జీవరాసికి రక్షణ కవచంగా ఓజోన్ పొర భూమిపై అన్ని జీవరాసులని కాపాడుతుందని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 16వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ పరిరక్షణ ఓజోన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేసిందన్నారు.



ఇడుపులపాడు హైస్కూల్‌లో ఓజోన్ ప్రాముఖ్యతను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నూతన సమన్వయకర్తను కలిసిన నాయకులు



నూతన సమన్వయకర్తతో చైర్మన్, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు

అద్దంకి: నియోజకవర్గ నూతన సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ అశోక్ కుమార్‌ను మునిసిల్ చైర్మన్‌తోపాటు వవిధ హోదాల్లో ఉన్న నాయకులు మంగళవారం పిడుగురాళ్లలో కలిసి అభినందనలు తెలియజేశారు. వారిలో మునిసిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్ కన్నెబోయిన అనంతలక్ష్మి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఈదా శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు మురహరి యాదవ్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, ఎస్సీ ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు గుడిమెట్ల విజయ్‌శేఖర్‌బాబు, విప్పర్ల వెంకటేశ్వర్లు, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యాక్షుడు మన్నెం రాజశేఖర్, మణికేశ్వరం మాజీ సొసైటీ అధ్యక్షుడు సోమా శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు మేడగం రమణ, కొత్తూబ ఆలు, గుంజి కోటేశ్వరరావు, కో అప్షన్ సభ్యుడు బాషా, క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు జక్కుల బ్రహ్మారెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు స్వాతిరెడ్డి, వార్డు ఇన్‌చార్జులు కొల్లా భువనేశ్వరి, లావణ్య, తదితరులున్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

అద్దంకిరూరల్: ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్‌నాయుడు తహసీల్దార్‌లకు సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గంలోని 5 మండలాల తహసీల్దార్‌లతో పీజీఆర్ఎస్ కింద వచ్చిన ప్రజాసమస్యల ఫిర్యాదులపై పరిష్కార వేదిక సమావేశం నిర్వహించారు. పీజీఆర్ఎస్ కింద అద్దంకి నుంచి 10, బల్లికురవ నుంచి 9, కొరిశపాడు నుంచి 3, జె. పంగులూరు నుంచి 4, సంతమాగులూరు నుంచి 5 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. సమస్యలకు సంబంధించి రెవెన్యూ అధికారులతో ముఖాముఖీగా ఆర్డీవో మాట్లాడి పరిష్కరించారు. అద్దంకి నుంచి ఎక్కువగా సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు రావడంతో అద్దంకి అధికారులపై ఆర్డీఓ అసహనం వ్యక్తం చేశారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం భాద్రపద మాసం పునర్వసు నక్షత్రం ఏకాదశి బుధవారం ప్రత్యేక పూజల చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.